# ఆశ్రయం

లోకనాథం ఎక్కిన బస్సు ఆ ఊరి చెరువుగట్టు పక్కగా ఉన్న మర్రిచెట్టు కింద ఆగేటప్పటికి తొమ్మిదిగంటలపైన అరగంట అయింది.

దూరంగా ఊరు.

ఆ ఊరుకీ చెరువు గట్టుకీ మధ్యగా కట్ట కిందగా నల్లటి తార్రోడ్డు. దాని మీదగా నడిస్తే పదినిముషాలు.

రోడ్డుకు అవతలపక్కగా ఓ పూరిల్లు. అందులో చిన్న హోటలు. దాని ముందు బొగ్గుల కుంపటి మీద ఇడ్లీలు ఉడుకుతున్న వాసన. చెక్కబెంచీ మీద ఇద్దరు కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ టీ తాగుతున్నారు. పక్కగా సిగరెట్టు బంకు... రోడ్డుకు అవతల మరి కొన్ని ఇళ్ళు... రెండు కొట్లు...

శీతాకాలపు ఎండలో తీక్షణత లేదు.

బస్సు దిగిన లోకనాథాన్ని ఎవరా ఈ కొత్త మనిషి అన్నట్లుగా టీ తాగుతున్న వాళ్ళు తలతిప్పి ఆసక్తిగా చూశారు.

అయినా ఒకసారి వాళ్ళవంక చూసి- ఆ ఊరు తెలిసినవాడిలా తలవంచుకొని తారురోడ్డుమీద నడక సాగించాడు.

చేతిలో చిన్న సూట్కేసు.

పదడుగులు వేసి మలుపు తిరుగుతుంటే ఎడం చేతి వైపు ఉన్న శ్మశానంలో శవం కాలుతున్న వాసన. అవతలగా బావి దగ్గర స్నానం చేస్తున్న మనుషులు.

లోకనాథం శివాలయం దాటాడు. రామాలయం దాటి నాలుగురోడ్ల కూడలిలో ఒక్కక్షణం ఆగాడు. అటూ ఇటూ రెండుసార్లు చూసి ఎడం వైపునకు తిరిగాడు. లెక్కేసుకుంటూ మూడు సన్నని సందులు దాటి నాలుగో సందులోకి తిరిగాడు.

సరిగ్గా కుడివైపున ఉన్న మూడో ఇంటి ముందు ఆగాడు.

మనసులో గీసుకున్న ప్లాను ప్రకారం– ఆ ఊరు తను రావడం ప్రథమమే అయినా ఎవరినీ అడగకుండానే తనకు కావాల్సిన ఇంటిని పట్టుకున్నాడు.

ఇంతవరకూ బాగానే ఉంది. ఇక ఆ ఇంటి యజమానితో గడపబోయే ఆ కొద్ది సమయం ఎలా ఉంటుందో అనే జంకు. లోపలకు వెళ్ళవలసిన అతణ్ణి కొన్ని క్షణాలు తటపటాయించేలా చేసింది. ఆపైన చేతిలోని సూట్కేసు బరువు పెరిగినట్లుగా చేతిని గుంజింది.

చిన్నగా నవ్వుకున్నాడు లోకనాథం.

"సరే చూద్దాం! ఏం జరిగినా భరించేందుకు సిద్ధమయ్యేగదా పొద్దున్నే శకుంతల ఇచ్చిన ఆ పెట్టెను తీసుకొని గుంటూరులో బస్సెక్కింది" అనుకుంటూ దగ్గరకు వేసి ఉన్నట్లున్న తలుపులను నెట్టుకొని గడపవతల కాలు పెట్టాడు.

"ఎవరు కావాలి?" పనివాడు శీనప్ప కాబోలు, చెట్లకు నీళ్ళుపెడుతున్న వాడల్లా కొత్త మనిషిని చూస్తూనే పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"దక్షిణామూర్తిగారు ఉన్నారా?"

"ఆయన పూజ చేసుకుంటున్నారు." అంటూ– లోకనాథం కొత్త ముఖాన్నీ, చేతిలోని పెట్టెనూ చూసి– పొరుగూరు నుంచి వస్తున్నట్లుగా గ్రహించి, "రండి!" అన్నాడు.

ఆయన్ను వరండాలోకి తీసుకువెళ్ళి మడిచిపెట్టి ఉన్న నరసరావుపేట కుర్చీని తీసి వాల్చాడు.

"మీరు కూర్చోండి... అయ్యగారు ఒక పావుగంటలో వస్తారు" అన్నాడు.

తలెత్తి నలువైపులా చూశాడు లోకనాథం. ఇల్లు పాతదే అయినా శుభ్రంగా ఉంది. వాకిట్లో పూలచెట్లు... ఓ పక్కగా పెద్ద బాదంచెట్టు... దానికి పాకుతున్న గండు చీమలు... మరో పక్కన విచ్చుకున్న ఎర్రటి పూలతో మందారచెట్టు... తలుపుకు పక్కగా నేలబారున చామంతి పాదులు...

అతను అలా నాలుగు వైపులా చూస్తుండగానే లోపలనుంచి ఓ ఆడమనిషి బయటకు తొంగి చూసి, వెంటనే వెనక్కు వెళ్ళిపోయింది. తరువాత రెండు నిముషాలకే నడివయసు వాళ్ళు ఇద్దరు బయటకు వచ్చారు.

ఆశ్చర్యంగా వాళ్ళ వంక చూశాడు లోకనాథం. శకుంతల చెప్పిన ప్రకారం ఆ ఇంట్లో దక్షిణామూర్తి... పనివాడు శీనప్ప కాక ఇంకెవ్వరూ ఉండగూడదు!... మరి వీళ్ళంతా ఎవ్వరూ?

"ఎవరు కావాలి మీకు?"

"దక్షిణామూర్తి గారు!"

"ఆయన పూజలో ఉన్నారు."

"పనిమనిషి చెప్పాడు."

"మీరు ఎక్కడనుంచి వచ్చారు?"

"గుంటూరు నుంచి!"

"మీ పేరు?"

"లోకనాథం."

"ఏం పనిమీద వచ్చారు?"

తలెత్తి తననుంచి వాళ్ళేదో కూపీలాగే ప్రయత్నంలో ఉన్నట్లుగా గ్రహించి కాస్త ఇబ్బందిగా చూశాడు వాళ్ళవంక.

"వారితో మాట్లాడాల్సిన పని ఉండి వచ్చాను."

"వారు మీకు తెలుసా?"

"తెలియకుండా మాట్లాడటానికి ఎందుకు వస్తాను?" కాస్త విసుగ్గా అన్నాడు.

"వస్తారు కూర్చోండి!" వాళ్ళు లోపలకు వెళ్ళిపోయారు ముఖం చిట్లించుకుంటూ.

ఇంటికి వచ్చిన మనిషికి మంచితీర్థం కావాలా- అని గూడా అడగని వాళ్ళ సంస్కారం అతణ్ణి విచలితుణ్ణి చేసింది.

శీనప్ప బావి దగ్గరకు వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కొని ఓ ఇత్తడి చెంబుతో నీళ్ళు తీసుకు వచ్చి లోకనాథం దగ్గర పెడుతూ, "కాళ్ళు కడుక్కోండి" అన్నాడు.

ఆయన లేచి, మెట్ల పక్కగా ఉన్న మల్లెపొద దగ్గర నాపరాయి మీద కాళ్ళూ చేతులూ కడుక్కొని వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

స్టీలు గ్లాసెడు మంచినీళ్ళు తెచ్చి పక్కగా పెట్టాడు అతనే.

గ్లాసు ఎత్తి గడగడా తాగాడు లోకనాథం.

ఖాళీ గ్లాసు కింద పెడుతుండగా లోపలనుంచి దక్షిణామూర్తి బయటకు వచ్చాడు.

అరవయ్యేళ్ళదాకా ఉంటాయి. దబ్బపండు రంగులో శరీరం. మంచి ఒడ్డూ పొడుగూ ఉండటంతో వయసును కప్పివేస్తున్న ఆకృతి.

"చెప్పండి... ఏం పనిమీద వచ్చారు?" అన్నాడు ఆయన- తను మామూలుగా కూర్చుండే పడక కుర్చీలో కూర్చుంటూ.

"నాది గుంటూరు దగ్గర నల్లపాడు గ్రామం... అక్కడ స్టేషన్‌కు దగ్గరగా ఓ వృద్ధ ఆశ్రమం నిర్వహిస్తున్నాను... నా పేరు లోకనాథం... నన్ను మీ దగ్గరకు శకుంతల పంపింది!" అన్నాడు చిన్నగా.

దక్షిణామూర్తి ఆయన చివరి మాటలు వింటూనే ఉలిక్కిపడ్డట్లుగా తలెత్తాడు. అంతేకాదు- వరండా తలుపులు కదిలిన శబ్దమూ అయింది. ఇద్దరూ తలెత్తి ఒకేసారి అటుచూశారు! అక్కడ ఇందాక వచ్చి లోకనాథాన్ని పలకరించిన వాళ్ళు నిలబడి ఉన్నారు. పక్క కిటికీ దగ్గర ముందుగా తనను తొంగి చూసిన స్త్రీ నిలబడి ఉంది.

దక్షిణామూర్తి నొసలు చిట్లించి కోపంగా వాళ్ళ వంక చూశాడు. తరువాత లోకనాథం వైపుకు తిరిగి "మీకు శకుంతల ఎలా తెలుసు?" అన్నాడు. ఆ ప్రశ్న వేస్తున్నప్పుడు ఆయన కంఠం తడబడింది.

"మాది ఆశ్రమమని చెప్పాను గదా!... రెండు నెలల క్రితం ఒకరోజు తెల్లవారేటప్పటికి ఆమె ఆశ్రమ ముఖద్వారం పక్కగా ఉన్న అరుగుమీద ముడుచుకు కూర్చొని కనబడింది... అప్పటినుంచీ మా దగ్గరే ఉంటూ వృద్ధులకు సేవ చేస్తోంది..."

దక్షిణామూర్తి కళ్ళు మూసుకున్నాడు. ముఖమంతా మ్లానమయి... వయసు తెచ్చిన ముడతల్లో తడి ఏర్పడి ఆయన వయసును మరింత పెంచింది.

కోలుకోలేక పోతున్నట్లుగా రెండు నిముషాల వరకూ అలాగే కళ్ళుమూసుకు ఉండిపోయాడు ఆయన. ఆ మూసుకున్న రెప్పల వెనుకనుంచి నీరు జలజలా రాలుతోంది.

"అంటే ఈ ప్రపంచంలో శకుంతల ఇరవై అయిదు సంవత్సరాల వయస్సుకే మరోసారి జీవితంలో మోసపోయిందన్న మాట!" ఆ మాటలు ఆయన గుండెల్లోనుంచి పొంగి వస్తున్న దుఃఖంతో తడిసి ముద్దగా ఉన్నాయి.

లోకనాథం అయన్నే చూస్తున్నాడు. ఆయన ముఖంలోకి వింతగా చూస్తున్నాడు.

ఆయన గతాన్నీ, బాధనూ చెరిపేసుకోవాలి అన్నట్లుగా కుర్చీ చేతి మీద ఉన్న కండువాను తీసి ముఖం తుడుచుకుంటూ, "సుందరమ్మా! కాఫీ పట్టుకురా!" అన్నాడు.

"అలాగే అన్నయ్యా" లోపల కిటికీ పక్కనుంచి ఆ స్త్రీ కంఠం.

"దేనికి పంపింది నా దగ్గరకు మిమ్మల్ని?" అన్నాడు ఉత్సుకతతో లోకనాథం వంక చూస్తూ దక్షిణామూర్తి.

"మీకు ఈ పెట్టె ఇచ్చి... తన క్షమాపణలు చెప్పమంది!" అన్నాడు తలవంచుకొని.

"ఏమున్నాయి అందులో?"

"ఆభరణాలు అనుకుంటాను... మూటగట్టి పెట్టింది!!" అన్నాడు తలవంచుకొని.

"సొమ్ములు పంపిన తరువాత కూడా క్షమాపణలు చెప్పుకోవాల్సిన అవసర మేముంది?" ఆయన కంటివెంట నీరు మరోసారి ధారగా కారసాగింది.

సుందరమ్మ కాఫీ గ్లాసులతో బయటకు వచ్చింది. ఆమె వెనగ్గా తలుపు దగ్గర నిల్చున్న ఆ ఇద్దరూ వచ్చారు.

"బావగారూ! అన్నీ ఉన్నాయేమో మీరు ఒక్కసారి చూస్తే తీసుకువెళ్ళి ఆ పెట్టెను లోపల పెడతాం" అన్నాడు అందులో ఒకతను.

దక్షిణామూర్తి కళ్ళెత్తి వాళ్ళ వంక తీక్షణంగా చూశాడు. "ఇక్కడ మీకేం పని... పెద్ద మనుష్యులతో మాట్లాడుతున్నప్పుడు మధ్యలో రావద్దనీ, కల్పించుకోవద్దనీ లక్షసార్లు చెప్పాను. ఊఁ... వెళ్ళండి ఇక్కడనుంచి!" ఆయన మాటలు చాలా కరకుగా, వాళ్ళను కసురుకుంటున్నట్లుగా ఉన్నాయి.

వాళ్ళు గొణుక్కుంటూ లోపలకు వెళ్ళారు. సుందరమ్మ కూడా ఇక అక్కడ ఉండటం మంచిది కాదు అన్నట్లుగా లోపలకు వెళ్ళి అంతకుముందు తను నిలుచున్న కిటికీ పక్కగా బయటకు తొంగి చూస్తూ నిలబడింది.

"మనసిచ్చిన మనిషితో అర్ధరాత్రి పూట ఈ గడప దాటింది... పోనీయ్‌లె ఎక్కడయినా సుఖంగా ఉంటే చాలు అనుకున్నాను!" చాలా భారంగా అన్నాడు దక్షిణామూర్తి.

"ఆ అమ్మాయి ఎండమావుల్ని చూసి భ్రమించింది... ఆమెకు ఇంటినుంచి బయటకు వచ్చిన తరువాత చేయి అందించిన మనిషి వెంట స్టేషన్‌కు నడిచింది. అక్కడ అప్పటికే

అతడి మిత్రుడున్నాడు. వీరికోసం ఎదురుచూస్తున్నాడు. ముగ్గురూ రైలెక్కారు. ప్రయాణంలో ఒంటిన అన్ని సొమ్ములెందుకు తీసి పెట్టెలో పెట్టు' అన్నాడు... నమ్మి పెట్టింది... పడుకుంది... కొత్త జీవితంలో కాలు పెడుతున్నందుకు భయం... నమ్మిన వాళ్ళను అన్యాయం చేస్తున్నాననే బాధ... దుప్పటి కప్పుకు పడుకున్నా నిద్ర పట్టనీయలేదు. పడుకున్న తనకు నిద్ర పట్టిందిలే అన్నట్లుగా ఆ మూడో మనిషి 'ఇక దిగిపోదామా పెట్టె తీసుకొని' అని అంటున్నాడు. అప్పుడు తను నమ్మిన దేవుడు అన్నాడు చిన్నగా- 'తొందరేముంది... నాలుగు రోజులు అనుభవించి, ముంబాయి తీసుకు వెళ్ళి అమ్మేస్తే ఈ సొమ్మే కాకుండా మరో ఇరవై వేలదాకా డబ్బుకూడా దొరుకుతుంది. ఆ ఏర్పాటు చేశానులే' అంటూ... ఆ మాటలు ఆమెను నిలువునా వణికించివేశాయి. ఒళ్ళంతా చెమటలు పట్టింది... అలాగే ప్రాణహీన అయి బిగుసుకు పోయి మొద్దు బారిపోతున్న మెదడుతో పడుకుంది. తెల్లవారుజామున ఎప్పుడో రైలు ఎక్కడ ఆగిందో గూడా తెలియని సమయంలో తోటి ప్రయాణీకులంతా నిద్ర మత్తులో జోగుతుండగా ధైర్యం చేసి పెట్టె తీసుకొని దిగేసింది. నాశనమవబోతున్న తన జీవితానికి ఏ గడ్డిపరకైనా దొరక్కపోతుందా అన్నట్లుగా. అది నల్లపాడు స్టేషను... దాని ఎదురుగా ఉన్న మా ఆశ్రమం అరుగు తెల్లవారేటంత వరకూ ఆమెను అమ్మ ఒడిలా సేద దీర్చింది!"

ఇద్దరూ కాఫీ తాగిన గ్లాసులను కింద పెట్టారు.

లోకనాథం లేచాడు. నాకు సెలవిప్పిస్తే బయల్దేరతాను.

దక్షిణామూర్తి లేచాడు. "మీరు భోజనంచేసి వెళ్ళాలి. తాను పంపిన మనిషిని మర్యాద చేసి పంపారని తెలుసుకున్న శకుంతల తనమీద నాకు కోపం లేదని అర్థం చేసుకుంటుంది!"

"భోజనం చేయకపోయినా నాకు అర్థమయిన విషయాన్ని ఆమెకు మాటల్లో చెప్పగలను!" లోకనాథం అనునయంగా అన్నాడు.

"మీరు అభోజనంగా వెళితే నన్ను కించపరిచినట్లే... అన్నీ తయారుగా ఉన్నాయి. ఆలస్యమేమీలేదు!"

లోకనాథం మాట్లాడలేకపోయాడు. లేచినవాడల్లా తిరిగి కుర్చీలో కూర్చుండి పోయాడు.

దక్షిణామూర్తి పెట్టె తీసుకొని లోపలకు వెళ్ళాడు. తరవాత అయిదు నిముషాలకు లోపలనుండి కేకలు... ఆ ఇద్దరు మగవాళ్ళూ ముఖాలు ముడుచుకొని బయటకు వచ్చి, తలుపు తీసుకొని వెళ్ళిపోయారు వీధిలోకి.

సుందరమ్మకు భోజనాలు ఏర్పాటు చేయమని చెప్పి, వాకిట్లోకి వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు దక్షిణామూర్తి. వాళ్ళ నడుమ చాలా సేపు మాటలు దొర్లాయి... బాధలు, ఆవేశాలు దొర్లాయి... ఆవేదనలు దొర్లాయి...

భోజనాలయ్యేటప్పటికి పన్నెండు గంటలయింది.

పది నిముషాలు వరండాలో విశ్రాంతిగా కూర్చున్న తరువాత లేచాడు లోకనాథం. "ఇక బయల్దేరతాను" అన్నట్లుగా.

"మంచిది... అలాగే!" అంటూ దక్షిణామూర్తి లేచి లోపలకు వెళ్ళి లోకనాథం ఊరునుంచి తెచ్చిన శకుంతల ఇచ్చిన పెట్టెను తిరిగి తెచ్చి అయన చేతికి అందిస్తూ, "వాటిని శకుంతల దగ్గరే ఉండనివ్వండి... ఆమె కంటూ నిర్దేశించిన వాటిని నేనేం చేసుకుంటాను? నేను ఆత్మీయంగానే తిరిగి ఇస్తున్నానని చెప్పండి!" అన్నాడు. తరువాత గొణుగుతున్నట్లుగా, "నా గొంతులో ప్రాణమున్నంత వరకూ నా ఆశీర్వచనాలు ఆమెకు ఉంటూనే ఉంటాయి!" అన్నాడు.

లోకనాథం కొన్ని క్షణాలు తటపటాయించినా ఆ వృద్ధుని మాటలు కాదని మనసు కష్టపెట్టలేనట్లుగా అందుకున్నాడు ఆ పెట్టెను.

తాను తెచ్చినప్పటికంటే బరువుగా ఉన్నట్లనిపించింది అది. ఆశ్చర్యంగా తలవంచి దాని వంక చూసి తలెత్తితే-

"శకుంతల లేమితో ఎన్నడూ బాధపడకూడదు. అందుకే కొంత డబ్బు గూడా దాంట్లో ఉంచాను!" అన్నాడు తృప్తిగా ఆ పెట్టెవంక చూస్తూ దక్షిణామూర్తి.

పెట్టె నేలమీద పెడుతూ లోకనాథం, "ఒక్కసారి మీ పాదాలకు నమస్కరించాలని ఉంది!" అన్నాడు వంగుతూ.

దక్షిణామూర్తి అయన భుజాలు పట్టుకొని త్వరత్వరగా ఆ చర్యను వారిస్తూ, "మీకు ఆయుక్షీణమని నేను ఆగాను ... లేకపోతే నేనే చేసేవాడిని ఆ పని... అనాథ వృద్ధులకు దేవుడు మీరు. కాకపోతే దేవదేవులే!" అన్నాడు ఆయన మీద గౌరవం నిండిన కంఠంతో.

ఆయన మాటలకు సిగ్గు పడుతున్నట్లుగా తలవంచుకొని గడపదాటాడు లోకనాథం.

"శీనప్పా! వీరిని క్షేమంగా గుంటూరు బస్సు ఎక్కించవలసిన బాధ్యత నీది!" అన్నాడు.

తలెత్తితే అప్పటికే వీధి వాకిటి దగ్గర పొన్నుగర్రతో నిలబడి ఉన్న శీనప్పా కనబడ్డాడు లోకనాథానికి!

ఈ పెట్టె తీసుకు వెళుతున్న తనను ఈ ఊరిలో ఎవరూ నిరోధించకుండా ఆయన చేసిన ఏర్పాటు అది అని గ్రహించినప్పుడు లోకనాథం హృదయం ద్రవించింది!

* * *

మూడు రోజుల తరువాత ఆశ్రమ చిరునామాకు తన పేరున దక్షిణామూర్తి నుంచి వచ్చిన కవరును ఆసక్తిగా తెరిచి అందులోని ఉత్తరాన్ని చదవడం మొదలిపెట్టాడు లోకనాథం.

"అయ్యా,

చీమలు శ్రమించి శ్రమించి చిన్నచిన్న పుట్టలు పెడితే అవే నాగులకు నివాసమవుతాయి - అని శతకకారుడు ఎన్నడో చెప్పాడు. అది నిజం. నేను కష్టించి పైసా పైసా కూడదీసి సంపాదించిన ధనాన్నీ, ఆస్తుల్నీ ఎన్నో నాగులు చుట్టుముట్టి నన్ను కాటేసయినా అపహరించాలని ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి. అందులో కొన్ని నాగుల్ని మీ కళ్ళతో మీరు చూడనే చూశారు.

నా ప్రథమ కళత్ర వియోగం తరవాత నా అనుభవం ఇది!

నాకు పిల్లలు లేరు.

అప్పుడు మిత్రుడు త్రయంబకం నన్ను ఒత్తిడి చేయటం ప్రారంభించాడు. రేపు మంచాన పడితే చేసేటందుకు ఓ ఆడదిక్కు కావాలిగదా- మా అమ్మాయి శకుంతలను నువ్వు ద్వితీయం చేసుకోరాదూ అని...అందువల్ల తనూ, పరిధిక మించివున్న తన కుటుంబ సభ్యులూ, రోజూ తిండికి ఇంత గ్రాసం కోసం కళ్ళు చించుకొని వెతుక్కోవలసిన అవసరం ఉండదని అతడి ఆశ... కుటుంబ సభ్యులలో ఒకరు సమిధ అయినా మిగతా అందరూ అందలమెక్కగలరనే ఆకాంక్ష ... ఆ విధంగా శకుంతల జీవితంలో మొదటిసారిగా మోసపోయి అరవై సంవత్సరాల నాకు ద్వితీయ కళత్రమై మా ఇంట కాలుపెట్టింది.

నేను చేసిన ఘోరమయిన తప్పిదం- శరీర వాంఛలు ఆ వయసులో ఆమెను కాల్చివేస్తుంటాయనే నిజాన్ని విస్మరించటం... నాకు ఆడమనిషి తోడై, నీడనిచ్చి ఇంత తిండి ఉడకేసి పడేస్తుందని ఆశించానే తప్ప... అదే ఆమె జీవితానందానికి శరాఘాత మవుతుందని అనుకోలేదు.

సరే! తరవాత విషయం మీకు తెలిసిందే...

పరవళ్ళు తొక్కుతున్న వయసు గుడ్డిగా ఓ యువకుణ్ణి నమ్మటం... అతడు వంచించటం... ఆపైన ఆమె మీ దేవాలయంలో కాలూనటం- మీరు వివరించిందే!

నేను ఇప్పుడో నిర్ణయానికి వచ్చాను.

ఈ ప్రపంచాన్ని ఈపాటికే అర్థం చేసుకున్న శకుంతల తన భవిష్యత్తునంతా వృద్ధుల సేవకే అంకితం చేస్తున్నట్లుగా నిర్ణయించుకుందని తెలిపారు మీరు.

వృద్ధుడనైన నేను, చుట్టూ నన్ను కమ్ముకుంటున్న పాముల్ని తప్పించుకొని ఇక్కడ ఉన్న చరస్థిరాస్తులను వదిలించుకొని అక్కడ మీ ఆశ్రమంలో చేరితే నా శేష జీవితం ప్రశాంతంగా వెళ్ళిపోతుందనే ఆశ, మీరు నన్ను వదిలి వెళ్ళిన క్షణం నుంచీ పురి గొలుపుతోంది.

ఒకనాడు, ఆమె ఈ గృహంలో నా గృహిణిగా కాలు పెట్టినప్పుడు, నేను ఆమె అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించలేదు. అదే తప్పు మరోసారి చేయడం నాకిష్టం లేదు. అక్కడికి నా రాక ఆమెకు మనస్తాపం కలిగించదు అని అనుకుంటే నేను నా నిర్ణయాన్ని అమలుపరుస్తాను.

ఆమె అందమైన భవిష్యత్తును నా కాలికింద వేసి పువ్వులా నలిపినందుకు క్షంతవ్యుడను.

మీ జాబుకై ఎదురు చూస్తూ.... - దక్షిణామూర్తి."

* * *

(*ఈనాడు: ఆదివారం: 25.11.2001*)